సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 1 । ఆగస్టు । 2024



ఆక్వాకు ఆక్సిజన్ గండం

భారీ వర్షాలు ఆక్వా సాగుకు గండంగా మారాయి. ఆక్సిజన్ అందక చెరువుల్లో చేపలు, రొయ్యలు నీటి ఉపరిత లంపై తిరుగాడుతున్నాయి. 8లో ▸



సర్కారు బడుల్లో ఎన్నికలు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికలకు ఏపీ సమగ్ర శిక్ష అధికారులు ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారు. 8లో ▸



కల్తీ ఆయిల్ ముఠా అరెస్టు

ఆటోలో కల్తీ ఆయిల్ అక్రమ రవాణా చేస్తున్న కాకినాడ జిల్లాకు చెందిన నలుగురు సభ్యుల ముఠాను భీమడోలు పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. 8లో ▸

పేదల ఇళ్లపై పక్షపాతమా?

- కొత్తగా మంజూరైన ఇళ్లకు మాత్రమే రూ.4 లక్షల సాయం
- జగన్ ప్రభుత్వంలో రికార్డు స్థాయిలో పేదలకు ఇళ్ల స్థలాలు
- జిల్లాలోని 779 లే అవుట్లలో 70,635 మందికి పట్టాలు పంపిణీ
- 10,500 ఇళ్లు పూర్తి, వివిధ దశల్లో మిగతా ఇళ్లు
- వాటికి సాయం పెంపుదలపై నోరుమెదపని కూటమి సర్కారు



తణుకు రూరల్ దువ్వ జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం

సాక్షి, భీమవరం: పేదల సొంతింటి కల సాకారానికి గత వైఎస్సార్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఇళ్లపై సర్కారు శీతకన్ను వేస్తోంది. ఇంటి నిర్మాణ సాయం రూ.4 లక్షలకు పెంచిన ప్రభుత్వం కొత్తగా మంజూరయ్యే వాటికి మాత్రమే ఈ పెంపుదల వర్తిస్తుందని ప్రకటించింది. నిర్మాణంలో ఉన్న ఇళ్లకు సాయం పెంపులేకపోవడంతో లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని 779 లే అవుట్లలో 70,635 మందికి గత ప్రభుత్వం ఇళ్ల స్థలాలు పంపిణీ చేసింది. ఇంటి నిర్మాణానికి రూ.1.8 లక్షల ఆర్థిక సాయంతో పాటు ఇంటి నిర్మాణంలో అండగాను నిలిచింది. డ్వాక్రా గ్రూపుల్లో సభ్యులుగా ఉన్న లబ్ధిదారులకు అదనంగా రూ.35,000 రుణ సాయాన్ని అందించింది. సబ్సిడీపై ఐరన్, సిమెంట్, ఇసుక ఉచితంగా అందజేసింది. లబ్ధిదారులపై రవాణ చార్జీల భారం పడకుండా లే అవుట్ల సమీపంలోనే వీటి స్టాక్ పాయింట్లు ఏర్పాటుచేసింది. గృహనిర్మాణ పనుల వేగవంతానికి కోట్లాది రూపాయలు వెచ్చించి జగనన్న కాలనీల్లో తాగునీరు, రోడ్లు, డ్రైన్లు, విద్యుత్ తదితర సదుపాయాల కల్పనకు కృషిచేసింది. పదేళ్ల తర్వాత ఇంటిపై సర్వహక్కులు ఉండేలా లబ్ధిదారుల పేరిట స్థలాలను పక్కాగా రిజిస్ట్రేషన్ చేసి కన్వేన్షన్ డీడ్లు అందజేసేందుకు చర్యలు తీసుకుంది. జిల్లాలో మెరక పనులు పూర్తయిన మేర 626 లే అవుట్లలో 47,716 ఇళ్లను మంజూరు చేసింది. రూ.575.11 కోట్ల వ్యయంతో వీటిలో 11,500 ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా మిగిలినవి పునాది, రూఫ్ తదితర దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయి.

కొత్త ఇళ్లకే పెంచిన సాయం

రాష్ట్ర గృహనిర్మాణ పథకాన్ని కేంద్ర ప్రభుత్వ పీఎం ఆవాస యోజనతో అనుసంధానం చేసి ఇంటి నిర్మాణానికి రూ. 4 లక్షలు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో కేంద్ర ప్రభుత్వం వాటా 60 శాతం కాగా మిగిలిన 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనుంది. కొత్తగా మంజూరు చేసే ఇళ్లకు మాత్రమే ఈ సాయం అందించనుంది. ఇప్పటికే ఇళ్లు మంజూరైన వారికి ఈ పథకం వర్తించదని, కొత్తగా ఎంపిక చేసిన వారికే వర్తింప చేయాలని కేంద్రం చెప్పినట్టుగా ప్రభుత్వం చెబుతోంది. ఈ మేరకు గత ప్రభుత్వంలో మంజూరై వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లకు పెంచిన సాయం వర్తించదని చెప్పకనే చెబుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతంలో చేపట్టిన పేదల ఇళ్లపై శీతకన్ను వేసేలా ప్రభుత్వ తీరు ఉందని పలువురు అంటున్నారు.

పెంచిన సాయం ఇవ్వాలి



గత ప్రభుత్వంలో ఇంటి స్థలం రావడంతో ఇంటి నిర్మాణం ప్రారంభించుకున్నాం. ప్రస్తుతం పునాది దశలో ఉంది. ప్రస్తుతం పెంచిన రూ. 4 లక్షల సాయం గతంలోని లబ్ధిదారులకు అందజేయాలి. అందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– బి.వెంకటలక్ష్మి, మోగల్లు, పాలకోడేరు మండలం

రూ.4 లక్షలు అందించాలి



ప్రస్తుతం నిర్మాణ వ్యయం బాగా పెరిగింది. గతంలోని రూ.1.80 లక్షలు సాయం సరిపోని పరిస్థితి ఉంది. పెంచిన రూ.4 లక్షలు సాయం అందరికి అందిస్తే త్వరితగతిన ఇంటి నిర్మాణం చేసుకునే వీలుంటుంది.

– బి.దుర్గ, ఆకివీడు

నిర్మాణంలోని వాటికీ వర్తింపజేయాలి

పెరిగిన గృహనిర్మాణ సాయాన్ని గత ప్రభుత్వంలోని ఇళ్లకు వర్తింప చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఆయా దశలను బట్టి సాయం పెంచి బిల్లులు విడుదల చేయడం ద్వారా పేద వర్గాల వారి ఇళ్ల నిర్మాణం వేగవంతానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలంటున్నారు.



భీమవరం జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణం

ఐపీఎస్‌కు సీసలి విద్యార్థి



తల్లిదండ్రులతో గణేశ్న శ్రీలక్ష్మి అన్నపూర్ణ ప్రత్యూష

కాళ్ల: పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం సీసలి గ్రామానికి చెందిన గణేశ్న భాను శ్రీలక్ష్మి అన్నపూర్ణ ప్రత్యూష ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. ప్రత్యూష గత ఏప్రిల్‌లో విడుదలైన సివిల్స్ ఫలితాల్లో 198 ర్యాంకు సాధించగా.. తాజాగా ఐపీఎస్ శిక్షణకు రావాలంటూ ఉత్తర్వులు అందాయి. గతంలో గ్రూప్–1లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించగా ప్రస్తుతం ఏలూరు జిల్లాలో ప్రొబెషనరీ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఐపీఎస్‌కు ఎంపికవడంతో ఆగస్టు 26 నుంచి ముస్సోరీలో జరగనున్న శిక్షణకు హాజరుకావాల్సి ఉంది. సీసలికి చెందిన గణేశ్న వెంకట రామాంజనేయులు, ఉషా దంపతుల కుమార్తె ప్రత్యూష మొదట నుంచి చదువుపై ఆసక్తితో ఉన్నత శిఖరాలు అందుకోవాలని కష్టపడి చదివింది. ఏడాది ఆగస్టులో విడుదలైన గ్రూప్–1 పరీక్షా ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించింది. అనంతరం ఏలూరు జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా ట్రైనింగ్‌లో ఉన్నారు. ఢిల్లీ యూనివర్సిటీ లేడీ శ్రీరామ్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది.

4 నుంచి సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

దెందులూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సాఫ్ట్‌బాల్ మెన్ అండ్ ఉమెన్ జిల్లా జట్ల ఎంపిక ఈ నెల 4న పెదవేగి ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో జరుగుతుందని జిల్లా అధ్యక్షుడు ఎం.రమేష్ బాబు, కార్యదర్శి ఎం.రాజా తెలిపారు. ఇక్కడ ఎంపికైన వారు మాచర్లల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

న్యూస్‌రీల్

రోల్‌బాల్ పోటీల్లో ప్రతిభ



బంగారు పతకం సాధించిన జిల్లా జట్టు

తణుకు అర్బన్: రాష్ట్ర స్థాయి రోల్ బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పశ్చిమ గోదావరి జిల్లా జట్టు అత్యుత్తమ ప్రతిభ చూపిందని కోచ్ వి.లావణ్య తెలిపారు. ఈ నెల 27, 28 తేదీల్లో విశాఖపట్నం అల్వార్ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన పోటీల్లో అండర్ 11, 14, 17 జట్లతో పాటు పురుషుల జట్లు పాల్గొనగా పురుషుల విభాగంలో స్వర్ణం, అండర్–17లో వెండి, అండర్–11లో కాంస్య పతకాలు సాధించినట్లు వివరించారు.

భీమవరం డీఎస్పీగా జయసూర్య



భీమవరం: భీమవరం డీఎస్పీగా ఆర్‌జీ జయసూర్య నియమితులయ్యారు. కృష్ణా జిల్లా గన్నవరం డీఎస్పీగా పనిచేస్తున్న జయసూర్యను భీమవరం డీఎస్పీగా నియమించారు. ఆయన గతంలో భీమవరం వన్‌టౌన్ సీఐగా విధులు నిర్వర్తించారు. ఇక్కడ పనిచేస్తున్న డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డిని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

నరసాపురం డీఎస్పీగా మురళీకృష్ణ

నరసాపురం: నరసాపురం డీఎస్పీగా విజయవాడ స్పెషల్ బ్రాంచ్ 5వ బెటాలియన్ ఏపీఎస్పీగా పనిచేస్తున్న ఎన్‌బీఎ మురళీకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఇక్కడ డీఎస్పీగా పనిచేస్తున్న జి.శ్రీనివాసరావును కృష్ణా జిల్లాకు బదిలీ చేశారు. మురళీకృష్ణ రెండు రోజుల్లో బాధ్యతలు చేపట్టనున్నారు.

ఏలూరు డీఎస్పీగా శ్రావణ్‌కుమార్

ఏలూరు టౌన్: ఏలూరు టౌన్ డీఎస్పీగా డీ.శ్రావణ్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ప్రస్తుతం చిత్తూరు డీపీటీసీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పుడు ఏలూరు డీఎస్పీగా పనిచేస్తోన్న ఈ.శ్రీనివాసులును పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మూడో బెటాలియన్‌లో పనిచేస్తూ అటాచ్‌మెంట్‌పై ఏలూరు ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీగా పనిచేస్తోన్న ఆర్.రామాంజినాయక్‌ను ఆత్మకూర్ డీఎస్పీగా బదిలీ చేశారు.

నిబంధనలు పాటించాలి

భీమవరం: జిల్లాలోని పీఎంపీ, ఆర్‌ఎంపీలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంతమంది ఆర్‌ఎంపీలు, పీఎంపీలు నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్లు, రోగులను అడ్మిట్ చేసుకోవడం, ఐవీ ఫ్లూయిడ్స్ ఇవ్వడం, ఇంజెక్షన్లు చేయడం చేస్తున్నారన్నారు. వారిపై ఆంధ్రప్రదేశ్ అల్లోపతిక్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోలీసు అధికారులకు సత్కారం



పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను సత్కరిస్తున్న ఎస్పీ అద్నాన్ అస్మి

భీమవరం: సుదీర్ఘ కాలం పోలీస్ శాఖకు విశేష సేవలందించి పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను ఎస్పీ అద్నాన్ నయీం అస్మి బుధవారం ఘనంగా సన్మానించారు. రిటైరైన ఎస్సై డి.సంజీవరావు, సీనియర్ అసిస్టెంట్ జె.పద్మావతిలను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఘనంగా సన్మానించినారు. ఈ కార్యక్రమంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థలో పదోన్నతులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలో వివిధ హోదాల్లో పని చేస్తున్న అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ ఆ సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పరిధిలోని తాడేపల్లిగూడెం ఎం అండ్ పీ విభాగంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పని చేస్తున్న ఏ.రఘునాథబాబుకు జనరల్ మేనేజర్‌గా పదోన్నతి కల్పించి ఆయనను విశాఖపట్నం కార్పొరేట్ కార్యాలయంలో ప్రాజెక్ట్స్ జనరల్ మేనేజర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. యలమంచిలి ఆపరేషన్ విభాగంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పని చేస్తున్న బీ.రఘుకు పదోన్నతి కల్పించి తాడేపల్లిగూడెం ఎం అండ్ పీ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. పురుషోత్తపల్లిలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పని చేస్తున్న బీవీ రామమూర్తికి డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పదోన్నతి కల్పించి ఏలూరులోని క్యూసీ విభాగంలో పోస్టింగ్ ఇచ్చారు.

పనుల్లేవు.. పైసా లేదు



కనకాయలంకలో కలెక్టర్ నాగరాణికి తమ గోడు చెబుతున్న వరద బాధితులు

యలమంచిలి: గోదావరి వరద ముంచెత్తడంతో వారం రోజులుగా ఇళ్లలో నుంచి బయటకు రాలేదు.. పనులకు వెళ్లే అవకాశం లేకపోవడంతో ఇళ్లలోనే ఉంటున్నాం.. వెంటనే నగదు సాయం అందించాలని కనకాయలంక, పెదలంక గ్రామాల్లోని వరద బాధిత కూలీలు కలెక్టర్ చదలవాడ నాగరాణికి మొరపెట్టుకున్నారు. కనకాయలంక, పెదలంక గ్రామాలలో బుధవారం ఆమె పర్యటించారు. వరద సాయంపై ప్రజలను అడుగగా రేషన్, నిత్యావసరాలు ఇచ్చారని, పశుగ్రాసం అందిందని చెప్పారు. పనులు లేకపోవడం వల్ల చేతిలో చిల్లిగవ్వ లేదని, ఖర్చులకు ఇబ్బందులు పడుతున్నామని వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. పంట నష్టంపై సమగ్ర సర్వే చేసి వివరాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. వైద్య శిబిరం వద్దకు వెళ్లి గర్భిణులు, బాలింతల వివరాలు, వారికి అందుతున్న సేవలు అడిగి తెలుసుకున్నారు. కనకాయలంక కాజ్‌వేను పడవపై దాటి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో పడవ దిగగానే పాఠశాలకు విద్యార్థులు వస్తుండటతో వారితో కొద్దిసేపు ముచ్చటించారు. ఆమె వెంట ఆర్డీఓ ఎం అచ్యుత అంబరీష్, తహసీల్దార్ చిక్కాల విజయశ్రీ కనకాయలంక, పెదలంక సర్పంచులు మద్దా శ్రీనివాస రావు, తాళ్ల నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్ పూడి డేవిడ్ సన్, వీఆర్వో సరెళ్ల లక్ష్మి తదితరులున్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు



పొన్నపల్లి వైద్య శిబిరంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో మహేశ్వరరావు

నరసాపురం: ప్రస్తుత విపత్తుల సమయాన్ని దృష్టిలో పెట్టుకుని ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది విది నిర్వహణలో అలసత్వం చూపించవద్దని జిల్లా వైద్య అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు ఆదేశించారు. బుధవారం డీఎంఅండ్‌హెచ్‌వో పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ, మున్సిబ్ స్ట్రీట్ అర్బన్ హెల్త్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అర్బన్ హెల్త్ సెంటర్లలో వైద్య సదుపాయాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఆసుపత్రులకు వచ్చే రోగులకు తగిన సూచనలు చేయాలన్నారు. అనంతరం పొన్నపల్లి ఏటిగట్టు ప్రాంతంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని తనిఖీ చేశారు. వైద్య శిబిరంలో అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట నరసాపురం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌లో డాక్టర్ వి.ప్రసాద్, వైద్యసిబ్బంది ఉన్నారు.

ఇంటి వద్దకే పింఛన్ల పంపిణీ

కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం: జిల్లాలోని పింఛనుదారులందరికీ ఆగస్టు 1నే పింఛన్లు పంపిణీ నూరు శాతం పూర్తి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ లబ్ధిదారులకు ఇంటివద్దనే చెల్లించడానికి అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. మొదటి రోజే నూరు శాతం పంపిణీ పూర్తి చేయాలన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లే అవకాశం ఉన్నందున, పింఛన్ల పంపిణీపై వారికి ముందస్తు సమాచారం అందించాలని సూచించారు. జిల్లాలో 2,31,874 మంది పెన్షన్ దారులు ఉన్నారని, వీరికి రూ.97.26 కోట్లు పంపిణీ చేయాల్సి ఉందని చెప్పారు. బయట ప్రాంతాల్లో ఉంటున్న పింఛన్‌దార్లు సాయంత్రంలోగా వారి గ్రామాలకు వచ్చి పింఛన్ అందుకువాలన్నారు. అందుబాటులో లేని లబ్ధిదారులకు రెండో తేదీన పింఛన్లు పంపిణీ చేయాలని చెప్పారు.

కార్గో సేవలకు విశేష ఆదరణ

తణుకు అర్బన్: ఏపీఎస్ఆర్టీసీ అందిస్తున్న కార్గో సేవలు ప్రజాదరణ పొందుతున్నాయని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కార్గో మేనేజర్ జీఎల్‌పీవీ సుబ్బారావు అన్నారు. తణుకు ఆర్టీసీ డిపోలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా తణుకు బస్ డిపో ఆవరణలోని కార్గో కౌంటర్‌కు గతేడాది రూ.76.27 లక్షలు ఆదాయం వస్తే ఈ ఏడాది నాలుగు నెలల్లోనే రూ. 47.13 లక్షలు సమకూరిందని స్పష్టం చేశారు. తణుకు కార్గో నుంచి ప్రతి వారం హైదరాబాద్ తదితర దూర ప్రాంతాలకు ఏపీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో కంటైనర్ వెళ్తుందని, ఇంటి సామగ్రితోపాటు ఫ్యాక్టరీ సామగ్రి, వ్యవసాయ ఉత్పత్తులు, బస్సుల్లో పట్టని పెద్ద వస్తువులు వినియోగదారులు కోరిన ప్రాంతానికి పంపవచ్చని వివరించారు.



తణుకులో సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ కార్గో మేనేజర్ జీఎల్‌పీవీ సుబ్బారావు

కార్గో సెంటర్ నడిపేందుకు ఆసక్తి ఉన్న వారికి బుకింగ్ ఏజెంట్‌గా పనిచేసేందుకు అవకాశం ఇస్తామని చెప్పారు. 98491 69396 నెంబరులో సంప్రదించాలని కోరారు.

కొల్లేరు కళకళ.. పక్షుల కిలకిల

- నిండు కుండలా కొల్లేరు
- పక్షుల కేరింతలతో కనువిందు
- ఎగువ నుంచి భారీగా చేరుతున్న వర్షపు నీరు



నిండుకుండలా కొల్లేరు ప్రాంతం



కొల్లేరులో పక్షుల సందడి

కైకలూరు: కోటి అందాల కొల్లేరు వర్షాలకు నిండు కుండలా మారింది. కొంతకాలంగా చుక్క నీరు లేక ఎడారిని తలపించిన ప్రాంతం ఇప్పుడు పచ్చని అందాలతో అలరారుతోంది. నీటి అలల మధ్య పక్షుల కేరింతలు ఆకట్టుకుంటున్నాయి. కైకలూరు నుంచి ఏలూరు రహదారిలో కొల్లేరు అందాలు కనువిందు చేస్తున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చి చేరే వివిధ డ్రెయిన్ల నీటిని సముద్రానికి పంపే ఏకైక మార్గమైన పెదఎడ్లగాడి వంతెన వద్ద నీటి ప్రవాహం పెరిగింది. సాధారణంగా వర్షాలు తగ్గిన తర్వాత ఎగువ నుంచి వచ్చే వరద నీరు కొల్లేరుకు చేరుతోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి 67 డ్రెయిన్లు, వాగుల ద్వారా లక్షా 10 వేల క్యూసెక్కుల నీరు వరదల సమయంలో కొల్లేరుకు చేరుతోంది. ప్రధానంగా బుడమేరు, తమ్మిలేరు డ్రెయిన్ల నుంచి ఎక్కువ నీరు కొల్లేరుకు వస్తోంది. ఒక్క కృష్ణాజిల్లా నుంచే వివిధ డ్రెయిన్ల నుంచి 35,500 క్యూసెక్కుల నీరు కొల్లేరులో కలుస్తోంది. ఇటీవల వర్షాలకు తమ్మిలేరు నుంచి భారీగా నీరు కొల్లేరులో చేరింది. దీంతో కొల్లేరులో జలకళ కనిపిస్తోంది. మండవల్లి మండలం పెదఎడ్లగాడి, చినఎడ్లగాడి, పోల్‌రాజ్ కాల్వలలో నీటి ప్రవాహం పెరుగుతోంది.

పరుచుకున్న పచ్చదనం

ఇటీవల కొల్లేరు నీరు తగ్గడంతో దీంతో పక్షుల సంఖ్య కూడా తగ్గింది. ఇప్పుడు వర్షాలకు కొల్లేరు సుందరంగా మారింది. పెలికాన్, పెయింటెడ్ స్టార్క్, ఓపెన్ బిల్ స్టోక్ వంటి పక్షులు సందడి చేస్తున్నాయి. సరస్సులో భారీగా నీరు చేరడంతో స్థానికులు చేపల వేట సాగిస్తున్నారు. సహజసిద్ధంగా లభించే ఈ చేపలకు మంచి డిమాండ్ ఏర్పడింది.

అడ్డుగా అక్రమ చేపల చెరువులు : కొల్లేరుకు చేరే వర్షపు నీరు సముద్రానికి చేరడానికి అక్రమ చేపల చెరువులు అడ్డంకిగా మారుతున్నాయి. ఏలూరు జిల్లా 9 మండలాల పరిధిలో 122 గ్రామాల్లో కొల్లేరు సరస్సు 22,689 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఏలూరు జిల్లాలో 1,35,275 ఎకరాలు, పశ్చిమగోదావరి జిల్లాలో 1,14,662 ఎకరాల ఆక్వా జోన్ పరిధిలో చేపల, రొయ్యల చెరువులు ఉన్నాయి. ఆక్రమిత చేపల చెరువులను కొల్లేరు ఆపరేషన్ పేరుతో నిర్మూలించినా ఇప్పటికీ యథాస్థానంలోనే సాగు చేస్తున్నారు. చేపల చెరువు గట్లు ఎక్కువ ఎత్తులో ఉండటంతో కొల్లేరు నీరు దిగవకు రాకుండా అడ్డుపడుతున్నాయి. ఆక్రమిత చెరువులను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

పరీవాహక గ్రామాలకు ప్రమాదం లేదు



కొల్లేరులో ఇటీవల వర్షాలకు భారీగా నీరు చేరింది. ఆ నీటిని సముద్రానికి చేరవేసే పెదఎడ్లగాడి వంతెన వద్ద ప్రస్తుతానికి 2 మీటర్ల నీటిమట్టం నమోదైంది. ఇదే నీటి మట్టం 3.2 మీటర్లకు చేరితే సమీప గ్రామాలకు ప్రమాదం. వంతెన వద్ద గుర్రపుడెక్క లేకపోవడంతో ఎగువ నుంచి వస్తున్నా నీరు కిందకు చేరుతోంది. కొల్లేరు పరీవాహక గ్రామాలకు ప్రమాదం లేదు.

– బి.ఇందిర, డ్రెయినేజీ శాఖ జేఈఈ, కైకలూరు

ఆషాఢం సారె వైభవం



ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయం వద్ద నుంచి సారె తీసుకెళ్తున్న ఆర్యవైశ్యులు

ద్వారకాతిరుమల: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద ఆలయంలో కొలువైన శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి, క్షేత్ర దేవతగా వెలుగొందుతున్న శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారికి పెద్ద ఎత్తున మహిళా భక్తులు బుధవారం ఆషాఢం సారె సమర్పించారు. గ్రామంలోని ఆర్యవైశ్య మహిళలు శ్రీవారి పాదుకా మండపం వద్ద నుంచి స్వీట్లు, పూలు, పండ్లు, గాజులు, పసుపు, కుంకుమలు, పట్టు వస్త్రాలతో మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం ఆలయంలో పలు రకాల కూరగాయలు, ఆకుకూరల అలంకారంలో శాఖాంబరిగా దర్శనమిచ్చిన అమ్మవారికి సారెను సమర్పించి, పూజాధికాలు నిర్వహించారు. కుంకుళ్లమ్మ అమ్మవారికి పోతునూరు శ్రీనివాస సేవా సమితి, మొగల్తూరు శ్రీ బండి ముత్యాలమ్మ తల్లి సేవా సమితికి చెందిన సుమారు 60 మంది మహిళలు స్వీట్లు, గాజులు, పూలు, పండ్లు, చీర, పసుపు, కుంకుమలను సారెగా అందించారు.

క్లుప్తంగా

ఇంట్లో బట్టలకు ఇస్త్రీ చేస్తూ..


జంగం తంబి మృతదేహం

దెందులూరు: ఇంట్లో బట్టలకు ఇస్త్రీ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందాడు. దోసపాడు వీఆర్‌ఓ సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దోసపాడు గ్రామానికి చెందిన జంగం తంబి (26) ఏలూరులోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం ఉదయం తన ఇంట్లో బట్టలకు ఇస్త్రీ చేస్తుండగా విద్యుత్ షాక్ గురయ్యాడు. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం ఏలూరు వైద్యశాలకు తరలించారు. అప్పటికే తంబి మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

జంగారెడ్డిగూడెం: అనుమానాదస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్టేషన్ రైటర్ శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొయ్యలగూడెంకు చెందిన షేక్ హుస్సేన్ (45) బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఇతని మొదటి భార్యకు ఒక కుమార్తె, ఒక కుమారుడు, జంగారెడ్డిగూడెంలో ఉన్న రెండో భార్య సయ్యద్ ముంతాజ్‌కు ఒక కుమారుడు సంతానం ఉన్నారు. జూలై 30న సాయంత్రం 4 గంటల సమయంలో హుస్సేన్ కొయ్యలగూడెం నుంచి జంగారెడ్డిగూడెం వచ్చి రెండో భార్య వద్ద ఆరోజు రాత్రి నిద్రించాడు. బుధవారం ఉదయం లేచి చూసేసరికి హుస్సేన్ మృతి చెంది ఉన్నాడు. దీంతో హుస్సేన్ సోదరుడి ద్వారా విషయం తెలుసుకున్న మొదటి భార్య షేక్ సలబ్‌జాని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని స్టేషన్ రైటర్ తెలిపారు.

నేరాల నిరోధానికి పటిష్ట చర్యలు

రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్



ఏలూరు టౌన్ : ఏలూరు జిల్లాలో నేరాలను నిరోధిస్తూ ప్రజలకు ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించేలా పటిష్టమైన చర్యలు చేపట్టాలనీ రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ అధ్యక్షతన బుధవారం జిల్లా నేర సమీక్షా సమావేశం చేపట్టారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు పోలీస్ సబ్ డివిజన్ల అధికారులు హాజరయ్యారు. ఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ గంజాయి రవాణా, విక్రయాలు, పోక్సో కేసులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. జిల్లా ఎస్పీ ప్రతాప శివకిషోర్ మాట్లాడుతూ మీ కోసం గ్రీవెన్స్‌లో తమ సమస్యలపై వినతులు చేసిన బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. అదనపు ఎస్పీ జి.స్వరూపరాణి, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ సూర్య చంద్రరావు, ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, డీఎస్పీలు ఉన్నారు.

దాసాంజనేయుడి హుండీ ఆదాయం రూ.2.12 లక్షలు

భీమవరం: పట్టణంలో వేంచేసియున్న శ్రీదాసాంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం హుండీ లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. 4 నెలల 12 రోజులకు హుండీలను భక్తుల సమక్షంలో తెరిచి లెక్కించగా రూ.2,12,684 ఆదాయం వచ్చిందని ఈఓ గొట్టుముక్కల నాగ సీతారామరాజు తెలిపారు. పర్యవేక్షకుడిగా యనమమదుర్రు శ్రీశక్తీశ్వరస్వామి వారి దేవస్థానం ఈఓ కె.శ్రీనివాసరావు వ్యవహరించారు.

సర్కారు బడుల్లో ఎన్నికలు షురూ

- నేడు పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల నోటిఫికేషన్
- పేరెంట్ కమిటీ పేరును.. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీగా మార్పు
- జూలై 8న ఎస్ఎంసీ నూతన కమిటీల ఎన్నికకు ఏర్పాట్లు
- అదే రోజూ కమిటీల ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికల పక్రియ
- ఉమ్మడి జిల్లాలో 469 పాఠశాలల్లో కొత్తగా ఎస్ఎంసీ కమిటీలు

నిడమర్రు: ఉమ్మడి పశ్చిమగోదారి జిల్లాలో ప్రభుత్వ పాఠశాల్లో స్కూల్ మేనేజ్ కమిటీల ఎన్నికలకు ఏపీ సమగ్ర శిక్ష అధికారులు ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారు. దీనిలో భాగంగా ఉమ్మడి జిల్లాలోని ప్రతి ప్రభుత్వ అనుబంధ పాఠశాలలో గురువారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఈనెల 8వ తేదీన నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించేలా విద్యాశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలోని ప్రైవేటు, ఇతర పాఠశాలలైన అన్ని ప్రభుత్వ పాఠశాలలతో పాటు కేజీబీవీ, గురుకుల పాఠశాలల్లో ఈ ఎన్నికలను నిర్వహిస్తారు. 2009 విద్యాహక్కు చట్టం ప్రకారం ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు పిల్లలకు ఉచిత నిర్బంధ హక్కులోని సెక్షన్ 21 ప్రకారం ఈ విద్యా కమిటీలను ప్రభుత్వం నియమించాల్సి ఉంది. గత ప్రభుత్వం బడుల్లో ఏర్పాటు చేసిన పేరెంట్ కమిటీల పదవీకాలం ఈ ఏడాది జూలై నెలతో ముగియడంతో కొత్తగా పేరెంట్ కమిటీల స్థానే స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలుగా పేరు మార్చి ఆగస్టు నెలలో ఎస్ఎంసీలు ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర సమగ్ర శిక్ష చర్యలు తీసుకుంది.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 469 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ పాఠశాలలతోపాటు ప్రభుత్వ అనుసంధానంగా ఉన్న గురుకులాలు, మైనార్టీ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఈనెల 8న ఎస్ఎంసీ ఎన్నికలు జరగనున్నాయి. పాఠశాల యూనిట్‌గా ఈ ఎన్నికలు జరుగుతాయి. ఆయా పాఠశాలల్లో ఒక్కో తరగతి నుంచి ముగ్గురు తల్లిదండ్రులను సభ్యులుగా ఎన్నుకుంటారు. ప్రాథమిక పాఠశాలల్లో 15 మంది, యూపీ స్కూల్లో 21 మంది, హైస్కూల్స్‌లో 24 మంది సభ్యులను ఎన్నుకుంటారు. ఇందులో ఆరుగురు ఎక్స్ అఫీషియో, ఇద్దరు కో–ఆప్షన్ సభ్యులు ఉంటారు. ఈ ఎన్నికలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.

షెడ్యూల్ ఇలా...

ఆగస్టు 1న ఉదయం 10 గంటలకు ప్రతి పాఠశాల నోటీస్ బోర్డులో ఎస్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ ప్రదర్శిస్తారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు ఓటర్ల జాబితాను నోటీస్ బోర్డులో ఉంచుతారు. ఆగస్టు 5న ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరించడం, పరిష్కరించడం, అదే రోజు సాయంత్రం 3–4 గంటల నుంచి మధ్య తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తారు. 8న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సభ్యుల ఎన్నికల నిర్వహణ పూర్తి చేయడం, 2 గంటలకు కమిటీ సభ్యులు, ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లతో ప్రమాణ స్వీకారం, అనంతరం 3 గంటలకు నూతన ఎస్ఎంసీ తొలి సమావేశం నిర్వహించేలా ఎస్ఎంసీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారు. ఈ ఎన్నికల ప్రక్రియ మొత్తాన్ని సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.



మార్గదర్శకాలు ఇలా..

- ఎన్నికల నిర్వహణకు కనీసం 50 శాతం తల్లిదండ్రులు/సంరక్షకులు హాజరు కావాలి. కోరం ఏర్పడటానికి సమయ పరిమితిని హెడ్‌మాస్టర్ నిర్ణయిస్తారు.
- ఎన్నికలు సాధారణంగా చేతులను ఎత్తడం ద్వారా లేదా నోటితో చెప్పడం ద్వారా నిర్వహించబడతాయి. ఆపరిష్కృత వివాదాల అసాధారణ పరిస్థితుల్లో, రహస్య బ్యాలెట్ విధానాన్ని అవలంబించవచ్చు.
- విద్యార్థి తల్లిదండ్రులలో ఒకరు మాత్రమే ఓటు వేయడానికి అర్హులు.
- వివిధ తరగతుల్లో పిల్లలు ఉంటే ఆయా తల్లిదండ్రులు ఆయా తరగతి ఎన్నికల ప్రక్రియలో పాల్గొనడానికి అర్హులే.
- ఎస్ఎంసీలో ఎన్నికైన సభ్యుల నుంచి చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌ను ఎన్నుకోవాలి. వీరిలో కనీసం ఒకరు వెనుకబడిన సమూహం లేదా బలహీన వర్గాలకు చెందిన పిల్లల తల్లిదండ్రులై ఉండాలి. వారిలో కనీసం ఒకరైనా మహిళ అయి ఉండాలి.
- ఒకసారి ఏర్పాటు చేయబడిన ఎస్ఎంసీ.. దాని రద్దు లేదా విలీనం వరకు శాశ్వతంగా ఉనికిలో ఉంటుంది. ఎలాంటి రాజకీయ జోక్యం ఉండకూడదు. ఈ ఎన్నికల ప్రక్రియలో అంతరాయం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి.
- తహసీల్దార్, ఎంపీడీవో, గ్రామ కార్యదర్శి, వీఆర్వో, వీఆర్ఏలు ఈ ఎన్నికల ప్రక్రియలో పరిశీలకులుగా పాల్గోవచ్చు.
- ఓటింగ్ ప్రాధాన్యత క్రమంలో తల్లి, తండ్రి, సంరక్షకుడు. అయితే వారిలో ఒకరికి మాత్రమే ఓటు వేసే అవకాశం ఉంది.
- ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ టీచర్స్, ఏఎన్ఎం, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఉంటారు. కో–ఆప్షన్ సభ్యులుగా గ్రామాభివృద్ధి/వార్డు కమిటీ నుంచి ఇద్దరు ఉన్నత విద్యా వంతులు లేదా విశ్రాంత ఉద్యోగులకు అవకాశం కల్పించాలి.

ప్రతి పాఠశాలలోనూ నిర్వహిస్తాం



ప్రభుత్వ అనుబంధంగా ఉన్న ప్రతి పాఠశాలలో ఈ ఎన్నికలను పాఠశాల స్థాయిలో నిర్వహించాల్సి ఉంది. సమగ్ర శిక్ష అధికారులు జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించి ప్రతి పాఠశాలలో ప్రకటించిన షెడ్యూల్ మేరకు నిర్వహించేలా సంబంధిత ఎంఈవో, డీవైఈవోలకు తగిన సూచనలు అందించాం.

– ఎస్.అబ్రహం, డీఈవో, ఏలూరు

కల్తీ ఆయిల్ రవాణా ముఠా అరెస్టు

- కురెళ్లగూడెం వద్ద ఆటోలో తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు
- 210 లీటర్ల కల్తీ అయిల్ స్వాధీనం.. డ్రైవర్‌తో సహా ముగ్గురి అరెస్టు


కురెళ్లగూడెం వద్ద కల్తీ ఆయిల్‌తో ఉన్న ఆటో, నిందితులతో ఎస్సై వై.సుధాకర్

భీమడోలు: ఆటోలో కల్తీ ఆయిల్ అక్రమ రవాణా చేస్తున్న నలుగురు సభ్యుల ముఠాను భీమడోలు పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్లితే.. కాకినాడ జిల్లా శంఖవరం మండల కత్తిపూడి గ్రామానికి చెందిన తోట తాతబ్బాయి రాజు, తోట చంటిబాబు, దూడల వెంకటరమణ, కుశలం శ్రీరాములు కొంత కాలంగా ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా డీజిల్, పెట్రోల్‌లను విడిగా విక్రయిస్తున్నారు. అందులో సాల్వెంట్ ఆయిల్ కలిపి వాటిని కల్తీ చేస్తూ రహదారిపై వెళ్లే వాహనదారులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. భీమడోలు పోలీసులకు అందిన సమాచారం మేరకు కురెళ్లగూడెం వేబ్రిడ్జి వద్ద తనిఖీలు చేస్తుండగా నలుగురు సభ్యుల ముఠా ఓ ఆటోలో 210 లీటర్ల కల్తీ ఆయిల్‌ను తరలిస్తున్నట్లు ఎస్సై వై.సుధాకర్ గుర్తించారు. ఆటో, ఆయిల్‌ను స్వాధీనం చేసుకుని, డ్రైవర్, మరో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

నా భర్తను స్వదేశానికి తీసుకురండి


జుబేర్ భార్య మోహరున్నిసా, తల్లి సలీమున్నిసా

ఆగిరిపల్లి: సౌదీలో తీవ్ర ఇబ్బందులు పడుతున్న తన భర్తను స్వదేశానికి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని మొహరున్నిసా ప్రభుత్వాన్ని కోరుతోంది. జీవనోపాధి కోసం మూడు నెలల క్రితం తాను మస్కట్ దేశానికి వెళ్లగా, అక్కడ తన యజమాని అనేక ఇబ్బందులకు గురి చేయడంతో మన దేశంలోనే కొంతమంది సాయం చేయడం వల్ల ఇండియాకు వచ్చి ప్రాణాలతో బయటపడ్డానని తెలిపింది. అయితే తన భర్త షేక్ జుబేర్ సౌదీలో కార్ డ్రైవర్‌గా పని చేయడానికి వెళ్లగా మూడు నెలల నుంచి జీతం ఇవ్వడం లేదని, అడిగినందుకు పాస్ పోర్ట్ లాక్కుని ఇష్టం వచ్చినట్టు దాడి చేశారన్నారు. అక్కడి నుంచి ఎలాగోలా ప్రాణాలతో బయటపడ్డారని, అయితే తన భర్తకు ఆహారం, నీరు దొరక్క అనే కష్టాలు పడుతున్నాడని, వారం క్రితం మంత్రి నారా లోకేష్‌ను కలిస్తే త్వరలోనే స్వదేశానికి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు. కానీ ఇప్పటివరకు ప్రభుత్వం, అధికారులు ఏ చర్యా తీసుకోలేదని వాపోయారు. తన భర్తను స్వదేశానికి తీసుకొచ్చేలా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఆమె కోరారు.

108 కోసం నిరీక్షించి.. ఆగిన గుండె

ఆగిరిపల్లి: గుండె నొప్పితో బాధపడుతూ 108 వాహనం కోసం రెండు గంటలు నిరీక్షించినా ఫలితం లేక ప్రైవేట్ వాహనంలో తరలిస్తుండగా ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. ఆగిరిపల్లికి చెందిన జొన్న రత్తయ్యకు గుండె నొప్పి రావడంతో అపస్మారక స్థితిలో చేరుకున్నాడు. అతనిని కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్లగా, వైద్యులు సీపీఆర్ చేసి ప్రాణాలను నిలబెట్టారు. మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని వైద్యులు సిఫారసు చేయడంతో 108కి ఫోన్ చేశారు. అయితే ఆగిరిపల్లిలో ఉన్న వాహనం నూజివీడు వెళ్లిందని, వేరే వాహనాన్ని పంపిస్తామని కాల్ సెంటర్ నిర్వాహకులు తెలిపారు. రెండు గంటలైనా 108 వాహనం రాకపోవడంతో రత్తయ్యను ప్రైవేటు వాహనంలో బంధువులు విజయవాడ తీసుకెళుతుండగా మార్గమధ్యలో చనిపోయాడు. సమయానికి 108 వాహనం వచ్చి ఉంటే రత్తయ్య బతికేవాడని బంధువులు ఆవేదనగా చెబుతున్నారు. అత్యవసర సమయంలో 108 వాహనం అందుబాటులో లేక చికిత్స కోసం ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆగిరిపల్లికి మరో 108 అంబులెన్స్‌ను కేటాయించి స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆక్వాకు ఆక్సిజన్ గండం

- ఎడతెరిపిలేని వర్షాలతో ఒడిదుడుకుల్లో ఆక్వా సాగు
- ఆక్సిజన్ అందక చనిపోతున్న రొయ్యలు, చేపలు
- విద్యుత్ కోతలతో ఏరియేటర్లు తిరగక సతమతం
- ఉష్ణోగ్రతలు తగ్గుతుండటంతో వ్యాపిస్తున్న తెగుళ్లు


రొయ్యల చెర్వులో తిరుగుతున్న ఏరియేటర్లు



గణపవరం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు ఆక్వా సాగుకు గండంగా మారాయి. ఇటీవల దారుణంగా పడిపోయిన చేపలు, రొయ్యల ధరలు కొద్దికొద్దిగా పెరుగుతూ ఆక్వారంగం కుదుటపడుతున్న సమయంలో నెల రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల ఆక్వా సాగు మళ్లీ ఒడిదుడుకుల్లో సాగుతోంది. గత పదిహేను రోజులుగా ఒకమోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతూనే ఉన్నాయి. దీంతో ఆక్సిజన్ అందక చెరువుల్లో చేపలు, రొయ్యలు నీటి ఉపరితలంపై తిరుగాడుతున్నాయి. ఈ సమస్యను అధిగమించడానికి రైతులు నిరంతరం చెరువుల్లో ఏరియేటర్లు తిప్పుతున్నారు. అయితే వీటికి విద్యుత్ కోతలు ఆటకంగా మారాయి. దీంతో ఆయిల్ ఇంజిన్లు ఉపయోగించి ఏరియేటర్లు తిప్పుతున్నారు. కొందరు రైతులు చెరువుల్లో ఆక్సిజన్ లోటు పూడ్చడానికి రసాయనాలు చల్లుతున్నారు. పదిరోజులుగా ముసురు, భారీ వర్షాల కారణంగా చెరువుల్లో ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గిపోయి చేపలు, రొయ్యలు తెగుళ్లబారిన పడుతున్నాయి. మేతలు సరిగా తినలేక నీరసించిపోతుండటాన్ని రైతులు గమనించి యుద్ధప్రాతిపదికన పట్టుబడి పట్టి అయినకాడికి అమ్ముకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 1.25 లక్షల ఎకరాలలో రొయ్య, మరో 1.50 లక్షల ఎకరాల్లో చేపల సాగు జరుగుతుంది. వాతావరణం ప్రతికూలంగా మారడంతో రొయ్యలకు వైట్‌కట్, వైరస్ వ్యాధులు, చేపలకు మొప్పతెగులు వంటివి సోకుతుండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆక్వా రైతులు నష్టపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను మత్స్యశాఖ అధికారులు సూచిస్తున్నారు.

చెరువుల్లో ఆక్సిజన్ తగ్గితే..

- చెరువుల్లో ఉష్ణోగ్రతలు తగ్గకుండా నిరంతరం ఏరియేటర్లు తిప్పుతూ నీటిని రీసైక్లింగ్ చేయాలి.
- విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగితే ఏరియేటర్లు తిరగడానికి జనరేటర్లు, ఆయిల్ ఇంజిన్లు సిద్ధం చేసుకోవాలి
- ఆక్సిజన్ లోప నివారణకు పొటాషియం పర్మాంగనేట్ సిద్ధంగా ఉంచుకుని, అవసరం మేరకు చెరువులో చల్లుతుండాలి
- వర్షం నీరు చేరడం వల్ల చెరువులో నీటిమట్టం బాగా పెరగకుండా గట్టుకు 60 సెంటీమీటర్ల లోతు వరకు ఉండేలా చూసుకోవాలి
- ఆక్సిజన్ సమస్య ఉంటే మేతలు సరిగా తినని కారణంగా పరిమితంగానే చెరువులో మేతలు వేస్తుండాలి

ఆక్సిజన్ కొరత తీవ్రమైతే..

- ఆక్సిజన్ కొరత కారణంగా చెరువులో ఉండే పెద్దసైజు చేపలు చనిపోతాయి. ఆక్సిజన్ తగినంత అందకపోతే చేపలు నీటి ఉపరితలంపైకి వచ్చి నోటితో ఆక్సిజన్ పీల్చుకుంటాయి.
- మేతలు తినడం 75 శాతం మేర తగ్గిపోతుంది. దీనిని అధిగమించడానికి దిగువ చర్యలు తీసుకోవాలి.
- చెరువుల్లో మేత, సేంద్రియ ఎరువులను వేయడం పూర్తిగా మానివేయాలి
- చేపలు చనిపోతే వెంటనే బయటకు తీసివేయాలి
- కాల్షియం పెరాక్సైడ్, హైడ్రోజన్ పెరాక్సైడ్‌లను తగిన మోతాదులో కలిపి చెరువులో పిచికారీ చేయాలి
- ఉదయాన్నే చెరువులో 20 నుంచి 25 కిలోల సున్నం చల్లాలి
- ఆక్సిజన్ సమస్య అధిగమించిన తర్వాత చెరువులో టన్ను మేతలో 10 కిలోల మినరల్ మిక్సర్‌ను కలిపి మేతగా అందించాలి

ముందస్తు చర్యలతో నష్టనివారణ



భారీ వర్షాలు, వాతావరణ మార్పుల కారణంగా చేపలు, రొయ్యల చెరువుల వద్ద రైతులు ముందస్తు చర్యలు తీసుకోవడం ద్వారా నష్టాలను చాలా వరకు తగ్గించుకోవచ్చు. ముఖ్యంగా ఆక్సిజన్ కొరత నివారణకు చెరువులలో నిరంతరం ఏరియేటర్లు తిరిగేలా ఏర్పాట్లు చేసుకోవాలి. చెరువుల్లో అవసరం మేరకే మేతలు అందించాలి.

– శివరామకృష్ణ, మత్స్యశాఖ అధికారి

విద్యుత్ కోతలతో అధిక ఖర్చు




భారీ వర్షాల వల్ల వాతావరణ మార్పులతో చేపలు, రొయ్యలు తెగుళ్లబారిన పడి చనిపోతున్నాయి. చెరువుల్లో ఆక్సిజన్ కొరతతో ఏరియేటర్లు తిప్పేందుకు విద్యుత్ సరఫరా ఉండటం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో కౌంట్‌కు రాకుండానే పట్టుబడి చేస్తుండటంతో వ్యాపారులు ధర తగ్గించి కొంటున్నారు.

– కాకర్ల వినాయక, గణపవరం ఏరియా ఆక్వా రైతు సంక్షేమ సంఘం సభ్యులు

వరద సాయంపై కూటమి శ్రేణుల మండిపాటు

సామాజిక మాధ్యమాల వేదికగా విమర్శనాస్త్రాలు


కుక్కునూరులో ఇంకా వరద నీటిలో ఉన్న పంట చేలు

కుక్కునూరు: గోదావరి వరదతో అల్లాడుతున్న ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సాయంపై కూటమి పార్టీల వారే సోషల్ మీడియా వేదికగా విమర్శలు ఎక్కుపెడుతున్నారు. ఓవైపు గోదావరి వరద, మరోపక్క నీటమునిగిన పంటలు, కూలి పనులు లేక, పెరిగిన ధరలపై అల్లాడుతున్నామని అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. ఏటా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో వరదలు వస్తుంటాయి. 2022, 2023లో గోదావరికి వరదలు సంభవించినప్పుడు అప్పటి సీఎం వైఎస్ జగన్ పంట చేలు నీట మునిగి, పనుల్లేక అల్లాడుతున్న బాధితులకు నగదు పరిహారాన్ని అందించి ఆదుకున్నారని గుర్తు చేస్తున్నారు. అలాగే ఇళ్లు కూలిన వారికి కూడా రూ.5 వేల నుంచి రూ.90 వేల వరకు పరిహారాన్ని అందించారని చెబుతున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అందిస్తున్న సాయంపై, జగన్ ప్రభుత్వంలో అందించిన సాయంపై వ్యత్యాసాన్ని తెలుపుతూ సామాజిక మాధ్యమాల్లో ఆ పార్టీ నాయకులే వీడియోలు పోస్టు చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం గ్రామాలను ఖాళీ చేసిన వారికి మాత్రమే రూ.3 వేలు పరిహారం అందించి చేతులు దులుపుకుందని ఆరోపిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కొందరికే పరిహారం ఇవ్వడంపై సామాజిక మాధ్యమాల వేదికగా విమర్శలు చేశారు.

25 ఎకరాల భూమి కాజేతకు యత్నం


కేటుగాళ్లు కాజేయాలని చూసిన భూమి ఇదే

నూజివీడు: గత తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ సర్టిఫికెట్‌ను సృష్టించి 25 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకుని కాజేసేందుకు కొందరు కేటుగాళ్లు విఫలయత్నం చేశారు. అధికారులు సకాలంలో మేల్కొని తప్పుడు డాక్యుమెంట్ అని గుర్తించి రిజిస్ట్రేషన్ చేయకుండా తిరస్కరించారు. రెండు వారాల క్రితం జరిగిన ఈ సంఘటన బుధవారం నూజివీడులో వెలుగులోకి రావడంతో సంచలనంగా మారింది. వివరాలిలా ఉన్నాయి. నూజివీడు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 66–2లో 25.46 ఎకరాల భూమి రమీదునీసా బేగం పేరును ఉంది. ఆమె గతంలోనే మృతి చెందగా, కుమారులు అమెరికా, హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఆమెకు చెందిన వారు ఎవరూ నూజివీడులో లేకపోవడంతో ఆ భూమిపై కేటుగాళ్ల కన్ను పడింది. ఆగిరిపల్లి మండలం వట్టిగుడిపాడుకు చెందిన కొందరు ఈ భూమిపై కన్నేశారు. దీనిని ఎలాగైనా దక్కించుకోవాలన్న ఆశతో గతంలో ఇక్కడ పనిచేసి బదిలీ అయిన తహసీల్దార్ డీవీఎస్ యల్లారావు జారీ చేసినట్లుగా ఫోర్జరీ సంతకంతో నకిలీ పొజిషన్ సర్టిఫికెట్‌ను తయారు చేశారు. దీని ఆధారంగా రిజిస్ట్రేషన్ చేయించేందుకు స్టాంపులకు, రిజిస్ట్రేషన్ ఫీజు కింద రూ.17 లక్షలకు చలానాను సైతం బ్యాంకు నుంచి తీసుకున్నారు. ఈ విషయమంతా భూ యజమానులకు సంబంధించిన బంధువుకు తెలియడంతో ఆయన వెంటనే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి 66–2 సర్వే నంబర్ భూమి యజమానులు వేరే వారని, నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయడానికి వేరేవారు ప్రయత్నిస్తున్నారన్న విషయాన్ని సబ్ రిజిస్ట్రార్‌కు తెలియజేడయంతో వెంటనే రిజిస్ట్రేషన్‌ను నిలిపివేశారు. దీంతో కేటుగాళ్లు అక్కడి నుంచి నెమ్మదిగా జారుకున్నారు. ఈ విషయం పోలీస్‌స్టేషన్‌కు చేరినప్పటికీ కేటుగాళ్లపై కేసు నమోదు చేయకపోవడం, తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసినప్పటికీ రెవెన్యూ అధికారుల నుంచి కూడా పోలీసులకు ఫిర్యాదు అందకపోవడం గమనార్హం.

త్వరలో కేవీకేలో కోళ్ల పెంపకంపై శిక్షణ

ఉండి: ఎన్నార్పీ అగ్రహారం కృషీ విజ్ఞాన కేంద్రంలో త్వరలోనే కోళ్ల పెంపకం, వాటి యాజమాన్య పద్ధతులపై త్వరలోనే శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు బుధవారం తెలిపారు. శిక్షణపై ఆసక్తి గల మహిళలు, గ్రామీణ యువత, రైతులు చిన్న తరహా పరిశ్రమగా చేపట్టదలచినవారు కేవీకేను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాల కోసం 99896 23823 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవాలని కోరారు.

ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్ల ప్రారంభం

భీమవరం : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్ స్కూల్) ద్వారా 2024–25 విద్యా సంవత్సరానికి 10వ తరగతి, ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని జిల్లా విద్యాశాఖాధికారిణి జి.నాగమణి బుధవారం తెలిపారు. అడ్మిషన్ ఫీజు చెల్లించడానికి చివరి తేదీ ఆగస్టు 27 అని, రూ.200 పెనాల్టీతో సెప్టెంబర్ 9 వరకు ఫీజు చెల్లింపునకు గడువు ఉందన్నారు.

షామియానా అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక


షామియానా అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ప్రమాణస్వీకార దృశ్యం

భీమవరం: షామియనా అసోసియేషన్ ఎన్నికలు భీమవరంలో బుధవారం నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా యాళ్ల శ్రీనివాస్, కార్యదర్శిగా రంకిరెడ్డి బుజ్జిబాబు, ట్రెజరర్‌గా పట్నాల వెంకట రామకృష్ణ నియమితులయ్యారు. అనంతరం అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు సాయిరాజు విశ్వనాథరాజు నేతృత్వంలో భీమవరం అసోసియేషన్ అధ్యక్షుడిగా గాదిరాజు రామరాజు, కార్యదర్శిగా నడిపూడి నాగబాబు, ట్రెజరర్‌గా కోట వెంకట నరసింహారావు, కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీలతో ప్రమాణ స్వీకారం చేయించి, గౌరవ సత్కారం అందించారు. కే శివయ్య, చిగురుపాటి రాజు, ఎం.సూర్య ప్రకాష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కృష్ణపరమ్మాతకు పంచామృతాభిషేకాలు



కృష్ణపరమాత్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీటీసీ): ఆషాఢ బహుళ ఏకాదశి పురస్కరించుకుని బుధవారం ఉదయం స్థానిక రామచంద్రరావుపేటలోని కృష్ణ యోగ ధ్యాన మందిరంలో శ్రీ కృష్ణ పరమాత్మకు పంచామృతాలతో అభిషేకాలు, సహస్ర నామార్చనలు జరిగాయి. ఈ కార్యక్రమాలను మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



అత్తిలి ఆశ్రమ ప్రాంగణంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు

అత్తిలి: మండలంలోని శ్రీవిశ్వవిజ్ఞాన ఆధ్యాత్మిక పీఠం అష్టమ పీఠాధిపతి మొహియుద్దీన్ బాషా పలు ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను నిర్వహించి ఆదర్శప్రాయులుగా నిలిచారని అత్తిలి ఆశ్రమ పీఠం ప్రతినిధి నందం తాతయ్య అన్నారు. అత్తిలి శ్రీవిశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం ఆశ్రమ ప్రాంగణంలో బుధవారం మొహియుద్దీన్‌బాషా 35వ వర్ధంతి సందర్భంగా వెలగల సుదర్శనరెడ్డి, మాధవి దంపతులు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ మొహియుద్దీన్ బాషాను ఆదర్శంగా తీసుకుని నవమ పీఠాధిపతి ఉమర్ ఆలీషా విభిన్న రంగాల్లో సేవలు అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. పీఠం ప్రతినిధి బొండపల్లి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా ఉంటాం



దువ్వలో వరద బాధితులకు భోజనం అందజేస్తున్న పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు

తణుకు టౌన్: దువ్వ వయ్యేరు వరదల కారణంగా ఏటు గట్టున నివాసం ఉంటున్న వారికి తణుకు యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో బుధవారం వరద బాధితులకు మధ్యాహ్న భోజనం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ఫెలోషిప్ గౌరవ అధ్యక్షుడు హారత్ బాబు, అధ్యక్షుడు ప్రసన్న కుమార్‌లు మాట్లాడుతూ వరద బాధితులకు అండగా ఉంటామన్నారు. ఈకార్యక్రమంలో జయబాబు, కే సైమన్ పాల్, ఎం ఏసురత్నం, జీ నిరీక్షణ రావు, వై మాణిక్యాలరావు, పాల్గొన్నారు.

తణుకులో బైక్ చోరీ



తణుకులో బైక్ చోరీ చేస్తున్న గుర్తు తెలియని వ్యక్తి

తణుకు: పట్టణంలో బైక్ దొంగలు రెచ్చిపోతున్నారు. ఇటీవల కాలంలో ఇంటి ముందు పార్కింగ్ చేసిన వాహనాలను అపహరించుకుపోతున్నారు. తాజాగా స్థానిక పాతవూరు కొండాలమ్మ-పల్లాలమ్మ గుడి ఎదురుగా నివాసం ఉంటున్న నవీరి సాయిరాం తన యమహా బైక్‌ను ఇంటిముందు పార్కింగ్ చేశారు. బుధవారం తెల్లవారుజామున బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్‌ను అపహరించుకుపోయారు. వచ్చిన ఇద్దరు వ్యక్తులు మాస్కులు ధరించి ఉన్నట్లు తెలుస్తోంది. బైక్ అపహరించుకుపోయిన దృశ్యాలు దేవాలయం సీసీ కెమెరాలో నమోదయ్యాయి. ఈ ఘటనపై బాధితుడు సాయిరాం తణుకు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎం.నాగరాజు తెలిపారు.

పైపులైన్‌కు మరమ్మతులు చేయాలి

అత్తిలి: మండలంలోని శివారు సంతానగోపాలస్వామి, కుమ్మర వీధి ప్రాంతాలకు సరఫరా అయ్యే రక్షిత నీరు కలుషితం అవుతోందని స్థానికులు చెబుతున్నారు. తాగునీరు సరఫరా అయ్యే పైపులైన్ దెబ్బతినడంతో మురుగు నీటితో కలుషితమవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి రక్షిత నీటిని సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు. సమస్యపై పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేదని, దోమల నివారణకు మందును పిచికారీ చేయాలని దిరిశాల సత్యం సేవా సమితి అధ్యక్షుడు దిరిశాల మునేశ్వరరావు కోరారు.

నారు మునిగి.. గుబులు పెరిగి

- నిండా మునిగిన పంటలు
- ఆశలు వదులుకున్న రైతులు
- ముంపులో 3,400ఎకరాలు
- రైతులకు తీవ్రనష్టాన్ని మిగిల్చిన యనమదుర్రు డ్రెయిన్ వరద



అత్తిలి మండలం తిరుపతిపురంలో ముంపు వల్ల కుళ్లిన వరినాట్లు



ముంపుకు కారణమైన ఆరుదలకోడు డ్రెయిన్

అత్తిలి: మండలంలో ఖరీఫ్ వరి సాగు చేస్తున్న రైతుల్లో ఆందోళన పెరుగుతోంది. తాజాగా కురిసిన భారీ వర్షాలకు చాలా చోట్ల నారుమడులు నీటమునిగాయి. ఇప్పటికీ కొన్ని చోట్ల నీటి ముంపు నుంచి పొలాలు తేరుకోలేదు. ఓ వైపు నారు కుళ్లి పోతుందన్న దిగులు, మరోవైపు నారు ముదిరిపోయి దిగుబడి తగ్గిపోతుందన్న భయం రైతుల్ని పీడిస్తున్నాయి. నాట్లకు అనుకూలంగా ఉన్నచోట్ల దమ్ములకు సిద్ధమవుతున్నారు. మండలంలో యనమదుర్రు డ్రెయిన్ ఉగ్రరూపం దాల్చింది. మండలంలోని పంటలన్నీ నీటిలోనే ఉన్నాయి. సార్వాసాగు ప్రారంభంలోనే వరినాట్లు,నారుమడులు రోజుల తరబడి ముంపులో ఉండటంతో నాట్లు, నారుమడులు పూర్తిగా పాడైపోయాయి. అత్తిలి మండలంలో మొత్తం 14 వేల ఎకరాల్లో సార్వాసాగు చేపట్టగా ఇప్పటివరకు 6వేల ఎకరాల్లో నాట్లు పూర్తి అయ్యాయి. వర్షాలు, వరదలవల్ల మండలంలో 3,400 ఎకరాలలో వరినాట్లు, 180 ఎకరాలలో నారుమడులు ముంపుకు గురై పాడైపోయాయి. ప్రతీ ఏడాది సార్వాసాగు సమయంలో యనమదుర్రు డ్రెయిన్ ఉధృతికి అత్తిలి మండల పరిధిలో వేలాది ఎకరాలలో వరిపంటకు నష్టం వాటిల్లుతుంది. అత్తిలి మండలంలో వరిఘేడు, తిరుపతిపురం, బల్లిపాడు, కొమ్మర, ఈడూరు, లక్ష్మీనారాయణపురం ఆయకట్టు ప్రాంతంలో వరినాట్లు పాడవ్వడంతో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో పంటనష్టం అంచనాలు వేయడానికి సిద్ధమౌతున్నారు. అత్తిలి మండలంలో ప్రధాన మురుగునీటి డ్రెయిన్‌లైన ఈర్లకోడు, రాచకోడు, ఆరుదలకోడు, మంచిలి డ్రెయిన్‌ల ద్వారా వర్షంనీరు యనమదుర్రు డ్రెయిన్‌లో కలుస్తుంది. అయితే ఎగువ ప్రాంతంనుంచి యనమదుర్రు డ్రెయిన్‌కు భారీగా వరదనీరు వచ్చిన సమయంలో మురుగునీటి స్లూయిజ్‌గేట్లు మూసివేయడంతో నీరు బయటకు వెళ్లక పంటచేలు ముంపు బారిన పడుతున్నాయి. దీనికి తోడు ఆరుదలకోడు అవుట్‌పాల్ స్లూయిజ్ గేట్లు పూర్తిగా మూసుకోకపోవడంతో యనమదుర్రు డ్రెయిన్ నీరు వెనక్కి తన్నడంతో అధిక విస్తీర్ణంలో పంటచేలు ముంపుబారిన పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. డ్రెయిన్ ఉధృతికి ముంపుబారిన పడుతున్న పంటచేలకు అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పంటచేలు ముంపు బారినుంచి శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.

డాక్టర్ వెంపటాపు ఆదర్శనీయుడు



తణుకులో చిత్రకళా ఉపాధ్యాయుడు వెంపటాపును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

తణుకు అర్బన్: ఉపాధ్యాయ వృత్తిలో డాక్టర్ వెంపటాపు విద్యార్థులను తీర్చిదిద్దిన తీరు ఆదర్శనీయమని జెడ్పీ బాలుర హైస్కూల్ హెచ్ఎం కె.పద్మావతి అన్నారు. తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్‌లో చిత్రకళా ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ వెంపటాపు పదవీ విరమణ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో వెంపటాపు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన వెంపటాపు తన చిత్ర కళా నైపుణ్యాన్ని విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందజేశారన్నారు. చిత్రకళలో విద్యార్థులను తీర్చిదిద్ది దూర ప్రాంతాల్లో సైతం వివిధ కాంపిటేషన్స్‌కు తీసుకువెళ్లి వారిని బంగారు పతకాలు సాధించే స్థాయికి తీసుకువెళ్లారని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఆయనలో ఉన్న చిత్ర కళా నైపుణ్యం మరింత మందికి అందించేందుకు కృషిచేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రధానోపాధ్యాయులతో పాటు పాఠశాల స్కూల్ సెక్రటరీ జీజే ప్రభువరం, అక్కింశెట్టి రాంబాబు, ఉపాధ్యాయులు వెంపటాపును ఘనంగా సత్కరించారు.

పర్యావరణాన్ని పరిరక్షించండి



మొక్కలు నాటుతున్న సీడబ్ల్యూసీ గోడౌన్ అసిస్టెంట్ మేనేజర్, ఏఐటీయూసీ నాయకులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని సీడబ్ల్యూసీ గోడౌన్ అసిస్టెంట్ మేనేజర్ ప్రతాప్ కుమార్ విజ్ఞప్తి చేశారు. గోడౌన్స్ లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం నల్లజర్ల రోడ్డులోని గోడౌన్ ప్రహరీ గోడ పొడవునా సుందీరకరణలో భాగంగా వేప, గానుగ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్, గోడౌన్ సూపరింటెండెంట్ శివ సాయి కుమార్, ఏఐటీయూసీ నాయకులు ఓసూరి వీర్రాజు, తాడికొండ శ్రీనివాసరావు, పోలిరాతి ఆదినారాయణ, గోక నాగరాజు, వెంకటేష్, సుబ్బారావు, వెంకటరెడ్డి, అంజిబాబు, ఆసరపల్లి రామకృష్ణ, సింహాచలం, జట్టు కార్మికులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులకు ట్రాక్టర్ ట్రక్కు కొనుగోలు



అత్తిలిలో ట్రాక్టర్ ట్రక్కును ప్రారంభిస్తున్న సర్పంచ్ గంటావిజేత

అత్తిలి: గ్రామంలో పారిశుద్ధ్య పనులు వేగవంతంగా జరగడానికి నూతనంగా కొనుగోలు చేసిన ట్రాక్టర్ ట్రక్కు దోహదపడుతుందని సర్పంచ్ గంటావిజేత నాగరాజు అన్నారు. అత్తిలి గ్రామ పంచాయతీ నిధులతో కొనుగోలు చేసిన ట్రాక్టర్ ట్రక్కు, తాగునీటి సరఫరాకు ట్యాంకర్‌లను ఆమె ప్రారంభించారు. ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, వార్డు సభ్యుడు గారపాటి నాగరాజు, టీడీపీ మండలాధ్యక్షుడు ఆనాల ఆదినారాయణ, పూతినీడి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, ఆల్తి సత్యనారాయణ, కూసంపూడి మూర్తి, కొరిపల్లి హరి, గాది నాగరాజు, సుంకర సుబ్రహ్మణ్యం, కుక్కల రమణ, ఇంజే బాలవర్ధన్, రాంబాబు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యం



పెంటపాడు మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

పెంటపాడు: పార్టీలకతీతంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడుపుదామని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం పెంటపాడులో ఎంపీపీ దాసరి హైమావతి అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశాఖల వారీగా చేస్తున్న పనులను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు వచ్చిన సమయంలో కేవలం కంటి తుడుపు చర్యలు కాకుండా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొంటూ శాశ్వత పరిష్కార దిశగా అధికారులు ప్రణాళికలు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారుల సూచనల మేరకు సర్పంచ్‌లు పారిశుద్ధ్య పరిస్థితిని మెరుగుపరచుకోవాలన్నారు. బెల్టుషాపులు, గంజాయి కేసుల పట్ల పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంపీపీ దాసరి హైమావతి, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పులూరి వరలక్ష్మిలు మాట్లాడుతూ ఈనెల 1న జరిగే పింఛన్ పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. ఉపాధి హామీ సోషల్ ఆడిట్ ప్రజా వేదిక ఈనెల 6న పెంటపాడు మండల కార్యాలయం వద్ద జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలాజీ, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు ముప్పిడి సరోజని, సర్పంచ్ల ఛాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో బాధితులకు భోజనం



ముంపు బాధితులకు భోజనం అందిస్తున్న దాతలు

తణుకు: ఇటీవల కురిసిన వర్షాలు, వరదలు కారణంగా తణుకు మండలం దువ్వ గ్రామంలో నిరాశ్రయులైన బాధితులకు పలువురు దాతలు బుధవారం భోజన ఏర్పాట్లు చేశారు. తణుకు పాతవూరు 13వ వార్డు ఇన్‌చార్జ్ పచ్చిపాల మృత్యుంజయరావు ఆర్థిక సాయంతో సుమారు వంద మందికి భోజన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు మొల్లం మైఖేల్, వై.సత్తియ్య, బి.వెంకటేష్, బి.కిరణ్, పాస్టర్ కాకర్ల పండు పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

పెంటపాడు: మండలంలోని డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎస్. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. హిందీ, రసాయన శాస్త్రం, కామర్స్, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్ట్‌లలో ఒక్కో పోస్టుకు అర్హులైనవారు ఆగస్టు 3 లోపు కళాశాలలో సంప్రదించాలన్నారు.

బ్యాంకు పథకాలు వినియోగించుకోండి



కెవికెలో నాబార్డు శిక్షణ పొందుతున్న మహిళలు

తాడేపల్లిగూడెం: మహిళలు బ్యాంకులో ఉన్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంకు తాడేపల్లిగూడెం, వెంకట్రామన్నగూడెం మేనేజర్లు రామకృష్ణ, శ్రీధర్‌లుకోరారు. స్వశక్తి మహిళలకు నాబార్డు సహకారంతో వెంకట్రామన్నగూడెంలో జరుగుతున్న శిక్షణా కార్యక్రమంలో భాగంగా బ్యాంకింగ్ రంగంలో మహిళలకు అందుబాటులో ఉన్న వ్యక్తిగత, బృందాలకు అందజేసే రుణాలు గురించి వివరించారు. స్వయం ఉపాధి పథకాలు పొందడానికి అర్హతలు, స్కీమ్‌ల గురించి వివరించారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను ఆచరణలో పెట్టడానికి బ్యాంకింగ్ రంగం నుంచి ఆర్థిక చేయూత చాలా అవసరమని ఉద్యానవర్సిటీ విస్తరణ సంచాలకులు ఇ.కరుణశ్రీ చెప్పారు. మహిళలు తయారుచేసిన వస్తువులను ప్రదర్శించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల సమస్యలు పరిష్కరించాలి



డిగ్రీ కళాశాల వద్ద ధర్నా చేస్తున్న పీడీఎస్‌వోలు

పెంటపాడు: మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ధర్నా నిర్వహించారు. పీడీఎస్ఓ సంస్థ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా రాష్ట్రంలో కునారిల్లుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలల సమస్యలను తక్షణం పరిష్కరించాలని పీడీఎస్‌వో ఉమ్మడి జిల్లా కమిటీ పిలుపు నిచ్చింది. ఈ సందర్భంగా జిలా కార్యదర్శి ఎస్ మోహన్ తదితరులు మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా రెగ్యులర్ అధ్యాపకులు లేరని, భవనాల్లో సౌకర్యాలు లేవని, మరుగుదొడ్లు లేవని, ఉపాధ్యాయులకు సరైన సౌకర్యాలు కల్పించలేకపోతున్నారని పలు ఆరోపణలు చేసారు. గోపి, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పంట నష్టంపై కమిటీల పర్యటన

తాడేపల్లిగూడెం రూరల్: అధిక వర్షాలకు ఇటీవల మండలంలో పంటనష్టం వివరాల సేకరణపై గురు వారం నుంచి మండల, గ్రామ స్థాయి కమిటీలు పర్యటిస్తాయని మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ తెలిపారు. పంట నష్టపోయిన రైతులు గ్రామాల్లో అందుబాటులో ఉండి పంట నష్టం వివరాలను కమిటీలకు తెలియజేయాలన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

తాడేపల్లిగూడెం: పట్టణంలో అర్హులైన 9335 మంది సామాజిక పింఛనుదారులకు ఆగస్టు1న ఉదయం 6గంటల నుంచి పింఛన్లను ప్రజాప్రతినిధులు పంపిణీ చేస్తారని మునిసిపల్ కమిషనర్ మురళీకృష్ణ తెలిపారు. దీని కోసం 4.02 కోట్లు విడుదలయ్యాయన్నారు. గురువారం ఉదయం ఆరు గంటల నుంచి 35 సచివాలయాల్లో పనిచేస్తున్న 235 మంది సచివాలయ కార్యదర్శులు ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందజేస్తారన్నారు.

గొల్లలకోడేరులో సివిల్ రైట్స్ డే

పాలకోడేరు: మండలంలోని గొల్లలకోడేరు గ్రామ పంచాయతీ ఆవరణలో సివిల్ రైట్స్ డే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ, వీఆర్ భరత్‌కుమార్ మాట్లాడుతూ సివిల్ రైట్స్ డే నిర్వహణలో జిల్లా అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని, సమాచార లోపం కారణంగా కేవలం సచివాలయం, గ్రామ పంచాయతీ సిబ్బందితో సమావేశం నిర్వహించారన్నారు. గ్రామాలలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారం, చట్టాలు, హక్కులు, దళితులకు వర్తించే రాయితీలు వంటి అంశాలపై చర్చించే అవకాశం లేకపోయిందని గ్రామానికి చెందిన దళితులు ఎవరూ సమావేశంలో పాల్గొనలేదని, సరైన సమాచారం ఇచ్చి ఉంటే దళితులు ఈ సమావేశానికి వచ్చి ఉండేవారన్నారు. ఎస్సీ ఎస్టీ అత్యాచార కేసుల గురించి, దళితులపై జరుగుతున్న దాడులు, వివక్షత, మహిళలపై జరుగుతున్న ఆకృత్యాలు, అత్యాచారాలు, మహిళల అక్రమ రవాణా, పోక్సో కేసులు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగం, దళితుల శ్మశాన భూముల ఆక్రమణలు వంటి హేయమైన చర్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సివిల్ రైట్స్ డే నిర్వహించడంలో అలసత్వం వహించిన అధికారులపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో గ్రామ సర్పంచ్ కుక్కల లక్ష్మి, ఆర్ఐ ముత్యాల నాగభూషణం, ఈవోపీఆర్డీ ఎం.రామాంజనేయులు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎస్.రాము, ఎస్సై నాళం శ్రీనివాసరావు, , సచివాలయ కార్యదర్శి కె.శ్రీవిద్య, వీఆర్వో కె.ఇందిర, సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే కేసులు



తణుకు టౌన్: మండపాకలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

తణుకు టౌన్: మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడడం చట్టరీత్యా నేరమని, అటువంటి వారిపై కేసులు నమోదు చేస్తామని తణుకు ఐసీడీఎస్ సూపర్ వైజర్ వీవీకేఎస్‌కె కృష్ణ కుమారి తెలిపారు. మిషన్‌శక్తి కార్యక్రమంలో భాగంగా తణుకు మండలం మండపాక గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, బాలికల పట్ల వివక్షను విడనాడాలని, 18 ఏళ్ల నిండకుండా వివాహాలు చేస్తే బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంమని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు అచ్యుత, రాణి, సుశీల, ఆయాలు పాల్గొన్నారు. తణుకు మండలం తేతలి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో జరిగిన అవగాహనా కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ సీహెచ్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ బాలికలపై జరిగే లైంగిక వేధింపుల్లో భాగంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

మహిళల పట్ల వివక్ష విడనాడాలి

తాడేపల్లిగూడెం రూరల్: సమాజంలో మహిళల పట్ల వివక్ష విడనాడాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి అన్నారు. మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని ఆరుగొలను సచివాలయం వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ లింగ సమానత్వం పాటించాలన్నారు. బాలికలు, మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఆరుగొలను సచివాలయ కార్యదర్శి బి.చంద్రరాజు మాట్లాడారు. ఎన్ఎస్‌కే. షేక్ హుస్నా భాను, అంగన్‌వాడీ కార్యకర్తలు బి.రాణి, జీఎస్ఎన్.లక్ష్మి, షేక్ కాజా బీ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

అత్తిలి: పనిచేసే ప్రదేశంలో మహిళల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన శిక్షలు విధిస్తారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి చెప్పారు. 100 రోజుల మిషన్‌శక్తి కార్యక్రమం కింద బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమాన్ని అత్తిలి మండలం వరిఘేడు పాఠశాలలో బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యానేరమని, బాల్యవివాహాలు చేసినా, ప్రోత్సహించిన వారిపై కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం శిక్షలు విధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయిని వి రాధిక, మహిళా సంరక్షణ కార్యదర్శి వై సత్యశ్రీ, ఆశా వర్కర్ ఎం మల్లికుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు కె మీనా కుమారి, సిహెచ్ బేబి, వై శ్రీదేవి, యు సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

పైడిపర్రులో భేటీ బచావో-భేటీ పడావో

తణుకు: మండలంలోని పైడిపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భేటీ బచావో-భేటీ పడావో కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.ఏడుకొండలు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణకుమారి మాట్లాడుతూ ఆడపిల్లలను పుట్టనిద్దాం, ఆడపిల్లలను ఎదగనిద్దాం అంటూ అవగాహన కల్పించారు. ముఖ్యంగా కౌమార దశలో విద్యార్థులు గుడ్డు, చిక్కి, రాగిజావ తప్పకుండా తీసుకోవాలన్నారు. రక్తహీనత లేకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమలో ఉపాధ్యాయులు ఏవీ రామలక్ష్మి, స్వరూపరాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం రూరల్ : ఆరుగొలను సచివాలయం వద్ద మాట్లాడుతున్న సచివాలయ కార్యదర్శి బి.చంద్రరాజు



అత్తిలి : వరిఘేడులో బాల్యవివాహాల చట్టంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి



తణుకు: పైడిపర్రులో అవగాహన కల్పిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏడుకొండలు